సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 10 । మార్చి । 2023



కడప నగర వనంలో ట్రెక్కింగ్ ఏర్పాటు చేయాలి

కడప నగర వనంలో ట్రెక్కింగ్ అందుబాటులోకి తీసుకురావాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. -8లో..



వైఎస్ఆర్‌సీపీ నాయకులపై దాడి

బ్రహ్మంగారిమఠం మండలం గుండాపురంలో ఓ భూ వివాదంలో కొందరు వైఎస్సార్ సీపీ నాయకులపై దాడిచేశారు. -8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.2/16.9

జిల్లాలో గురువారం 16.9- 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

పెద్ద బడులకు పేద బిడ్డలు



పాఠశాలలో విద్యార్థులు

- ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య
- పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం
- ఈ నెల 18 నుంచి దరఖాస్తుల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు.నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక వసతులు సమకూరాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదవాలనే పేద విద్యార్థుల కల నెరవేర్చాలనే సంకల్పంతో 25 శాతం సీట్లను ఉచితంగా కల్పిస్తున్నారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కుచట్టం ప్రకారం వైఎస్సార్ జిల్లాలోని పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య అవకాశం కల్పించింది. దీని ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి 1వ తరగతి చదివే వారికి ప్రయోజనం కలగనుంది. ఇది వారికి వరంగా మారనుంది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు ఉచిత విద్య పొందేవారి కోసం తప్పని సరిగా కేటాయించాలి. ఈ మేరకు ప్రభుత్వం గత నెల 26 షెడ్యూల్‌ను విడుదల చేసింది.

షెడ్యూల్ వివరాలు..

- జిల్లాలో ఈనెల 16వ తేదీలోగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్‌లో వివరాలను అందుబాటులో ఉంచాలి.
- తమ పిల్లలను 1వ తరగతిలో చేర్చే తల్లితండ్రులు ఈ నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు దరఖాస్తులు పోర్టల్‌లో నమోదు చేయాలి
- ఏప్రిల్ 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు అర్హుల జాబితా ప్రకటిస్తారు.
- ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశానికి ఏప్రిల్ 13న మొదటి విడతగా లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- ఏప్రిల్ 15 నుంచి 21వ తేదీ వరకు సీటు పొందిన వారి వివరాలు ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 25వ తేదీన రెండో ఎంపిక జాబితా విడుదల చేస్తారు
- ఏప్రిల్ నెల 26 నుంచి 30వ తేదీలోగా పాఠశాలల్లో చేరాలి
- సందేహాలు, సమస్యలపరిష్కారనికి తల్లితండ్రులు 14417 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలి.

కేటాయింపులు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశం ప్రకారం 25 శాతం ఉచిత సీట్లలో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఇతరులకు 6 శాతం, హెచ్ఐవీ బాధితులు, అనాథలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లను కేటాయించారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ. 1.20 లక్షలు, అర్బన్ ప్రాంతాల్లో రూ. 1.44 లక్షలుగా నిర్ణయించారు. అమ్మ ఒడి పథకం కింద విద్యార్థులు ప్రవేశం పొందిన పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించనుంది. ప్రవేశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని హెచ్‌టీటీపీ: సీఎస్ఈ.ఏపీ. జీవీలో.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఈ స్కూళ్లలో సీటు పొందిన విద్యార్థులు ఎంత ఫీజు చెల్లించాలో ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం అర్బన్ ప్రాంతంలో రూ, 8 వేలు , రూరల్ ప్రాంతంలో రూ. 6,500, గిరజన, షెడ్యూల్ ప్రాంతాల్లో రూ. 5,100గా నిర్ణయించారు.

మంచి నిర్ణయం



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్య అవకాశం పేద విద్యార్థలకు వరం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. 1వ తరగతి నుంచే పేద విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చదువుకునే అవకాశాన్ని కల్పించడం మంచి నిర్ణయం.

– అచ్చుకట్ల కరీముల్లా, జిల్లా పరిషత్తు కోఆప్షన్ సభ్యుడు, విద్య, వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యుడు

పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లలో వసతుల బాధ్యత ఆయా మండలాల తహసీల్దార్లదేనని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం కలెకర్టరేట్‌లోని వీసీ హాలులో జేసీ సాయి కాంత్‌వర్మతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్డీఓలు, సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, అన్ని మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్‌స్టేషన్ల వద్ద వసతులు, మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బంది, మెటీరియల్ రవాణా, బ్యాలెట్ పేపర్ల భద్రత తదితర అంశాలపై తహసీల్దార్లకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో, అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా పని చేయాలన్నారు. ఈనెల 13వ తేదీన ఎన్నికలు జరగనున్నాయని, పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వెబ్‌కాస్టింగ్ నిర్వహణ, పోలింగ్ మెటీరియల్ రవాణా కోసం ఎంపిక చేసిన రూట్ల భద్రతా చర్యలను పటిష్టం చేయాలన్నారు. ఆయా మండలాలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లలో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిమిత సంఖ్యలో ఏజెంట్లను అనుమతించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఈఓ ప్రభాకర్‌రెడ్డి, సీపీఓ వెంకట్రావు, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు యదుభూషణరెడ్డి, ఆనందనాయక్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జంబో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు తదితరులు

జంబో బ్యాలెట్‌బాక్సుల పరిశీలన

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల జంబో బ్యాలెట్ బాక్సులను కలెక్టర్ విజయరామరాజు గురువారం పరిశీలించారు. కలెక్టరేట్‌లోని సభా భవనంలో అధికారులకు అవగాహన కల్పించేందుకు వీటిని ఏర్పాటు చేశారు.

48 గంటల ముందే ప్రచారం నిషేధం

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 48 గంటల ముందే ప్రచారాన్ని నిబంధనల మేరకు నిషేధించనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ముగిసేసమయానికి అంటే 48 గంటల ముందు అనగా 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి ప్రచారాన్ని నిషేధిస్తామన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఆయా పార్టీల ప్రతినిధులు గమనించాలని తెలిపారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

కడప సిటీ: శాసనమండలి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ విజయరామరాజు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ, ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో కలెక్టర్ ఎన్నికల ప్రధాన అధికారితో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు స్లిప్పులను ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. స్ట్రాంగ్ రూములో మొత్తం సీసీ కెమెరాల నిఘా ఉండేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ వీసీలో స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, జేసీ సాయికాంత్‌వర్మ, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఫోటోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరీలో శిక్షణ

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్, సర్వీసింగ్(30 రోజులు), సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్(13రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల లోపు ఉన్న గ్రామీణ ప్రాంత నిరు ద్యోగ యువకులు శిక్షణకు అర్హులన్నారు. మార్చి 15వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం కానుందని, ఆసక్తిగల వారు తిరుపతి రోడ్డులో గర్ల్స్ ఐటీఐ పక్కనున్న తమ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చువారికి ఉచిత భోజన, వసతి సౌకర్యం ఉందన్నారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పది ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం



పెండ్లిమర్రి మండలం జీసీపల్లె జెడ్పీ హైస్కూల్లో విద్యార్థితో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతికి సంబంధించి ప్రీ ఫైనల్ పరీక్షలు జిల్లావ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల నిర్వహణ వల్ల విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని మరింత శిక్షణ ఇవ్వవచ్చు. ప్రీ ఫైనల్ పరీక్షలు ఈనెల 17వ తేదీ వరకు జరగనున్నాయి. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 27 వేలమంది విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షలు రాశారు.

అదనపు శనగల కొనుగోలుకు అనుమతులు

కడప అగ్రికల్చర్: జిల్లాలో శనగ కొనుగోళ్లకు సంబంధించి 3,850 మెట్రిక్ టన్నుల అదనపు కొనుగోలుకు మార్కెఫెడ్ ఎండీ రాహుల్ పాండ్యన్ అనుమతి ఇచ్చారని మార్కెఫెడ్ డీఎం తాడిగొట్ల నరసింహారెడ్డి తెలిపారు. గతంలో జిల్లావ్యాప్తంగా 17 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిన ఎండీ జిల్లాలో శనగలు అధికంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా 20,850 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 5 వేల మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేసినట్లు డీఎం నరసింహారెడ్డి చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు అంపైర్‌గా జిల్లా వాసి



సి.చంద్ర ఓబుళరెడ్డి

రాజుపాళెం: జాతీయ స్థాయిలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలం టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ సి.చంద్ర ఓబుళరెడ్డి ఎంపికయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో గత నెల 2 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షల్లో అర్హత పొందినట్లు చెప్పారు. దేశం నలుమూలల నుంచి 120 మంది పరీక్షలో పాల్గొన్నారని, అందులో కేవలం 27 మంది మాత్రమే అర్హత సాధించారన్నారు. చంద్ర ఓబుళరెడ్డి స్వగ్రామం కమలాపురం మండలం చదిపిరాళ్ల. ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించండి

కడప సిటీ: జిల్లాలో నులి పురుగుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భంగా కలెక్టర్ అధ్యక్షతన లోజుమ్ ద్వారా జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. తొలుత కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో 1–19 సంవత్సరాల్లోపు పిల్లలకు 14 నుంచి 18వ తేది వరకు నులి పురుగుల నివారణ మందును విద్యార్థులకు అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక బృందాలు కలిసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నరు.

వెటరన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో గురువారం పి.ధనుంజయ రెడ్డి మెమోరియల్ వెటరన్స్ టీ–20 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ పోటీలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెటరన్ క్రికెట్ ఆడుతుండటం ద్వారా ఫిట్‌నెస్ మెయింటెన్స్‌తో పాటు పాతతరం, కొత్త క్రికెటర్ల మధ్య చక్కటి అనుబంధానికి దారి తీస్తుందన్నారు. తదుపరి వెటరన్ క్రికెట్ మ్యాచ్‌లు మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు ధనుంజయరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎం.పృథ్వీతేజ్‌రెడ్డి, సౌత్‌జోన్ కన్వీనర్ పి. సంజయ్‌కుమార్‌రెడ్డి, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్, సభ్యులు ఎల్. మునికుమార్‌రెడ్డి, పి. విజయ్‌కుమార్, అబ్దుల్‌రెహమాన్, విష్ణుమోహన్‌రావు, కరుణాకర్‌రెడ్డి, మహేంద్రారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఏవైడీ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి

అనంతపురం విజయం..

ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. జట్టులోని రాజాకృష్ణ 79 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు గులాం 2, ఇనాయతుల్లా 2, షాబుద్దీన్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన అనంత జట్టు 17.5 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. జట్టులోని షాబుద్దీన్ 56 పరుగులు, ప్రదీప్ 41 పరుగులు చేశాడు. దీంతో అనంతపురం జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

హైదరాబాద్ జట్టు గెలుపు

మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు 18.1 ఓవర్లలో 104 పరుగులు చేసింది. జట్టులోని శ్రీకాంత్‌రెడ్డి 38, ఖదీర్‌బాబా 24 పరుగులు చేశాడు. హైదరాబాద్ బౌలర్లు విష్ణు 3, వినోద్ 2 , చంద్రశేఖర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 14.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. జట్టులోని చంద్రశేఖర్ 43, రజనీకాంత్ 29 పరుగులు చేశారు. కడప బౌలర్లు సంజయ్‌కుమార్‌రెడ్డి 1, ఖదీర్‌బాబా 1 వికెట్ తీశారు. హైదరాబాద్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

రాములోరి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి, చిత్రంలో వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కోదండ రాముడి బ్రహ్మోత్సవాల వివరాలు..

తేదీ	ఉదయం	రాత్రి
మార్చి 31	ధ్వజారోహణం	శేష వాహనం
ఏప్రిల్ 01	వేణుగానాలంకారం	హంస వాహనం
2న	వటపత్రసాయి అలంకారం	సింహ వాహనం
3న	నవనీత కృష్ణాలంకారం	హనుమత్సేవ
4న	మోహినీ అలంకారం	గరుడ సేవ
5న	శివధనుర్బాణాలంకారం	గజ వాహనం
6న	రథోత్సవం	-------
7న	కాళీయమర్ధన అలంకారం	అశ్వ వాహనం
8న	చక్రస్నానం	ధ్వజావరోహణం
9న	సాధారణ కార్యక్రమాలు	పుష్పయాగం, ఏకాంతసేవ

ఒంటిమిట్ట: టీటీడీలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టిగా కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్ట రామయ్య బ్రహ్మోత్సవాలపై వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్‌తో టీటీడీ ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించాలన్నారు. టీటీడీ అధికారులు, జిల్లా అధికారులు సన్వయంతో పనిచేయాలన్నారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ..బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఇందులో భాగంగా భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు, హెల్ప్ డెస్కులు, సైన్ బోర్డులు, పారిశుధ్య, పబ్లిక్ అడ్రస్ సిస్టం విభాగాలు ఈ నెల 16వ తేదీలోగా తమ కార్యచరణ ప్రణాళికలను అందించాలన్నారు. అంతకుముందు టీటీడీ ఈవో ధర్మారెడ్డి, కలెక్టర్ విజయరామరాజుతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. జేఈవో వీరబ్రహ్మం రామయ్య కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, టీటీడీ సీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రగామి వర్సిటీగా వైవీయూ

- వీసీ ఆచార్య జింకా రంగ జనార్దన
- ఘనంగా యోగివేమన విశ్వవిద్యాలయం 17వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ తదితరులు



విద్యార్థిని నృత్యప్రదర్శన



హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం(వైవీయూ) 17వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం వైవీయూలోని ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన జ్యోతి ప్రజ్వలన చేసి వర్సిటీ ఉద్దీపన గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైస్ ఛాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన మాట్లాడుతూ ఉన్నతవిద్యలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు తట్టుకుని ప్రపంచపోటీలో నిలబడేలా విద్యార్థులు, అధ్యాపకులు శ్రమించాలని సూచించారు. నాణ్యమైన బోధన, పరిశోధన, పరిపాలనతో వైవీయూ త్వరలోనే దేశంలోనే అగ్రగామి విశ్వవిద్యాలయంగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దూరవిద్యావిధానంలో ఉన్నతవిద్యను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

ప్రపంచ పోటీ తట్టుకునేలా జ్ఞానసముపార్జన చేయాలి : అమిత్‌కుమార్ పాత్ర

ప్రపంచ పోటీ తట్టుకునేలా జ్ఞానసముపార్జన చేయాలని గాదంకి అట్మాస్ఫియర్ రీసెర్చ్ ల్యాబొరేటరీ, స్పేస్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్ర సూచించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదివే చదువు, పరిశోధనలు నూతన ఆవిష్కరణలకు నాందిపలకాలన్నారు. నోబెల్‌ప్రైజ్ విజేతల జీవితాలను గురించి చదవాలన్నారు. కేంద్రప్రభుత్వాల పరిధిలోని పలు సంస్థలు పరిశోధనలకు నిధులిస్తున్నాయని, వాటిపట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నతవిద్యను అందించాలనే ఆశయంతో వర్సిటీని ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 10వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవాలన్నది ఆయన ఆకాంక్ష అన్నారు. దాన్ని నెరవేర్చేదిశగా మనమందరం పని చేద్దామని కోరారు. ప్రభుత్వం రూ. 30 కోట్ల బ్లాక్ గ్రాంట్, మరో రూ.16 కోట్లు వేతనాల కోసం విడుదల చేసిందన్నారు. మరో రూ.60 కోట్లకు ప్రతిపాదనలు పంపితే రూ. 58 కోట్ల ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. ఈ నిధులతో వైవీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అకడమిక్ బ్లాక్స్ నిర్మిస్తామని తెలిపారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి విశ్వవిద్యాలయం ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు, వైవీయూ పాలకమండలి సభ్యురాలు ఆచార్య పుత్తా పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు జి. సుబ్బారెడ్డి, ఎ.హరినారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో సీఆర్‌పీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి ఎ.ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖలో క్లస్టర్ రీసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ) పాత్ర చాలా కీలకమని, వారికి కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలోని స్కాట్‌హాల్‌లో జిల్లాలోని సీఆర్‌పీలకు ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దీక్ష యాప్‌లో నిషిత 4.0 జిల్లాలోని ఎంఈఓ, సీఆర్‌పీలు, అంగన్వాడీ టీచర్లు తప్పని సరిగా ఆరు కోర్సులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో శాలసిద్ధిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మానిటరింగ్ అధికారి ధనలక్ష్మి, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ రాజాంజనేయులరెడ్డి, కార్యక్రమానికి సంబంధించిన విషయాలను క్లుప్తంగా వివరించారు. అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ రజనీకాంత్‌రెడ్డి నాడు– నేడుకు సంబంధించిన విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ ఇలియాస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అరటి తోట దగ్ధం

రూ.10 లక్షల మేర పంట నష్టం



కాలిపోయిన అరటి తోట

వేంపల్లె : మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామ పొలాల్లో నిప్పు అంటుకుని పి.నరసింహులు అనే రైతు అరటి తోట దగ్ధమైంది. గురువారం బాధితుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టి.వెలమవారిపల్లె గ్రామ సమీప పొలాల్లో చుట్టూ ఉన్న కొండ ప్రాంతానికి నిప్పు పెట్టడంతో అవి క్రమేనా మంటలు వ్యాప్తి చెంది అరటి తోటకు వ్యాపించాయి. చుట్టుపక్కల రైతులు గమనించి ఆ పొలం రైతుకు సమాచారం అందించారు. రైతు అక్కడికి చేరుకోగానే తన 5ఎకరాల అరటి తోట మంటలు అంటుకోవడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు అరటి తోట పూర్తిగా కాలిపోయింది. అలాగే ప్లాస్టిక్ పైపులు, డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. రూ.10లక్షల మేర పంట నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

గుండాపురం భూ వివాదంలో

వైఎస్‌ఆర్‌సీపీ నాయకులపై దాడి

- సచివాలయ కన్వీనర్ బేరీ రమణారెడ్డి, నేలటూరు వెంకటరామిరెడ్డికి తీవ్రగాయాలు
- సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు
- దాడిచేసిన 10 మంది స్టేషన్‌కు చేరుకున్న వైనం



కట్టెలు, రాళ్లతో దాడి చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) భూ వివాదం ఘర్షణలో గాయపడిన రమణారెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని చౌదరవారిపల్లె పంచాయతీ గుండాపురంలో ఓ భూ వివాదంలో కొందరు గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ సచివాలయ కన్వీనర్ బేరీ రమణారెడ్డి, నేలటూరు వెంకటరామిరెడ్డి మరి కొంతమందిపై కట్టెలు, రాళ్లతో దాడిచేశారు. ఈ దాడిలో రమణారెడ్డికి చెయ్యి విరగగా, వెంకటరామిరెడ్డికి తలపై బల మైన గాయం అయ్యింది. మరో ఇద్దరికి చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108లో వారిని బి.మఠంకు తరలించి అక్కడ వైద్య పరీక్షలు అనంతరం కడపకు తరలించారు. పోలీసులు, రమణారెడ్డిల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీపీపల్లెకు చెందిన బత్తల సిద్దయ్య కుటుంబ సభ్యులు బేరీ రమణారెడ్డిల మధ్య భూ వివాదం ఉంది. సర్వేనెంబర్ 281లో 2.81 ఎకరాలు 2007లో రమణారెడ్డి తల్లి పేరు న అసైన్‌మెంట్ పొంది ఉన్నాడు. పొలంకు సమీపంలో ఉన్న బత్తల సిద్దయ్య కుటుంబ సభ్యులు రమణారెడ్డిని పొలం దగ్గరకు రాకుండా అడ్డుకుంటూ ఉండేవారు. సర్వేనెంబర్ 341లో బత్తల సిద్దయ్యకు కొంత ప్రభుత్వ పొలం ఉంది. ఆ పొలం సాకుతో రమణారెడ్డి పొలంకూడా ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా మండలంలోని కొంతమంది పెద్దలు పంచాయతీ చేసి సిద్దయ్యను ఒప్పించారు. ఇందులో భాగంగా రమణారెడ్డి గురువారం పంచాయతీ పెద్దలతో కలిసి పొలం చుట్టూ కంచె ఏర్పాటుకు జేసీబీ తీసుకొని రాగా పంచాయతీ కుదరదని సిద్దయ్య కుటుంబ సభ్యులు ఒక్కసారిగా 6 మంది మహిళలు, 4 పురుషులు కారెంపొడి, కట్టెలతో సమీపంలో ఉన్నవారిపై దాడిచేశారు. రమణారెడ్డి కుటుంబ సభ్యులు వచ్చే సరికి దాడిచేసిన వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దాడిచేసిన వారు పోలీసుల అదుపులో ఉన్నారు.

రెవెన్యూ అధికారుల తప్పిదంతో ..

మండలంలో ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేయడంలో రెవిన్యూ వారి తప్పిదం ఉందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి జరిగిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భూ వివాదంలో దాడి జరిగితే కొన్ని యూట్యూబ్ ఛానళ్లు, ఎల్లో మీడియా అప్పుడే వైఎస్‌ఆర్‌సీపీ దౌర్జన్యం అంటూ కథనాలు అల్లడం సిగ్గుగా ఉందన్నారు. భూమిపై అన్ని అర్హతలు కల్గిన బేరీ రమణారెడ్డి పై కొందరు దాడిచేశారన్నారు. జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి మాట్లాడుతూ రమణారెడ్డి 2007లో అసైన్‌మెంట్ ద్వారా భూమిని పొందితే అటువంటిది సమీపంలోని వారు కేవలం రెవెన్యూ అధికారులకు డబ్బులు ఇచ్చుకొని అనధికారికంగా పొందాలనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కడప వాసి మాధవరెడ్డికి ఐపీఎస్ హోదా



కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా నాన్ క్యాడర్ ఎస్పీల హోదాల్లో పనిచేస్తున్న 10 మందికి ఐపీఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం జాబితా పంపింది. ఈ జాబితాను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి విడుదల చేసింది. ఈ జాబితాలో కడప నగరంలోని పాత కడపలో తమ తల్లిదండ్రులతో నివసిస్తూ విద్యాభ్యాసం చేసిన ఎస్.వి మాధవరెడ్డికి ఐపీఎస్ హోదా కల్పించారు. ఈయన కడపలో ఇంటర్ వరకు చదువుకున్నారు. తిరుపతి ఎస్వీ అగ్రికల్చర్ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశారు. ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ, క్రిమినాలజీ అండ్ పోలీస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంఏ పూర్తి చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా తెలంగాణాలో పనిచేశారు. తరువాత 2010 నుంచి డీఎస్పీగా పలు సబ్ డివిజన్‌లలో పనిచేశారు. కర్నూలు అదనపు ఎస్పీగా, గవర్నర్‌కు ఏడీసీగా పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా విధులను నిర్వహిస్తున్నారు. ఆయన తండ్రి ఆప్కాబ్ రిటైర్డ్ మేనేజర్. తల్లి హౌస్ వైఫ్, ఆయన సతీమణి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, వీరికి ఇద్దరు సంతానం. మన కడప వాసికి ఐపీఎస్ హోదా లభించడం ఆనందంగా ఉందని ఆయన సహచరులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

ఐపీఎస్ హోదా జాబితాలో ఉమామహేశ్వర్

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నాన్ కేడర్ ఎస్పీల హోదాల్లో పనిచేస్తున్న పలువురికి ఐపీఎస్ హోదా కల్పించారు. ఈజాబితాలో ప్రస్తుతం కడపలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న బి. ఉమామహేశ్వర్ వున్నారు. ఈయన గతంలో గ్రూప్–1 అధికారి హోదాలో కడప డీఎస్పీగా కూడా విధులను నిర్వహించారు.

దాడి కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నచౌక్ లక్ష్మీనగర్‌కు చెందిన సుంకర ఏకాంబర స్వామిపై రోకలి బండతోదాడి చేసిన కేసులో వేంపల్లి మండలం గాజులపేటకు చెందిన సుంకర విజయలక్ష్మీ, కంచన శ్రీనివాసులు, కంచన లక్ష్మీదేవిలకు రెండేళ్లపాటు జైలు శిక్షతో పాటు, రూ. 1000 జరిమాన విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. సుంకర ఏకాంబర్ స్వామి కుమారుడు వెంకట కృష్ణకుమార్‌కు విజయలక్ష్మికి వివాహమైంది. ఈ క్రమంలో విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కడప మహిళా స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఆమెకు వెంకటకృష్ణకుమార్‌కు, అతడి తండ్రి సుంకర ఏకాంబర్‌కు మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చిన్నచౌక్ పిఎస్ పరిధిలోని లక్ష్మీనగర్‌కు వెళ్లి 2020 ఆగష్టు 22న సుంకర ఏకాంబరస్వామితో పాటు కుటుంబసభ్యులను విజయలక్ష్మీ మరో ఇద్దరితో కలసి రోకలి బండతో కొట్టి గాయపరిచారు. ఈ సంఘటనపై అప్పటి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులపై నేరారోపణలు రుజువు కావడంతో ఒక్కొక్కరికి రెండేళ్లపాటు జైలు శిక్షతో పాటు, రూ. 1000 జరిమాన విధించారు.

యువగళం సాక్షిగా తమ్ముళ్ల తగాదా



పాదయాత్రలో గొడవ పడుతున్న ఇరువర్గాలవారికి సర్దిచెబుతున్న నారా లోకేష్

మదనపల్లె : యువగళం పాదయాత్ర నారా లోకేష్‌కు నాయకుడిగా గుర్తింపు తెచ్చేమాటేమో కానీ... మదనపల్లె నియోజకవర్గానికి చెందిన ఇద్దరు నాయకుల మధ్య తగాదా పెట్టింది. చినబాబు దృష్టిలో నేను మాత్రమే నాయకుడిగా మార్కులు కొట్టేయాలనుకునే ఆత్రుత కాస్తా ఇద్దరి మధ్య గొడవకు కారణమై, నారాలోకేష్ సర్దిచెప్పినా మంట చల్లారక చివరకు ఓ నాయకుడు పాదయాత్ర నుంచి అలిగి వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడింది. మదనపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టీడీపీ టికెట్ ఆశావహుడు జయరామనాయుడు ఇరువురూ యువగళం పాదయాత్ర మదనపల్లె నియోజకవర్గంలో అడుగుపెడుతున్న సందర్భంగా నారాలోకేష్‌కు స్వాగతం చెప్పేందుకు పోటీ పడ్డారు. ఈ క్రమంలో జయ రామనాయుడు తన అనుచరులతో నారాలోకేష్‌ను స్వాగతిస్తుండగా, మధ్యలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటిరమేష్ రోప్‌వేలో దూరారు. దీంతో తాము ఆహ్వానం పలుకుతుంటే నీవు మధ్యలో రావడమేంటని జయరామనాయుడు, తాను ఇన్‌చార్జ్‌నంటూ రమేష్ ఇద్దరూ లోకేష్ ఎదుటే వాగ్వాదానికి దిగారు. ఇది తీవ్రమవడంతో నారాలోకేష్ జోక్యం చేసుకుని కార్యకర్తలను వారించి ఇద్దరికి సర్దిచెప్పి చల్లబరచారు. వివాదం సద్దుమణిగిందనుకునేలోపు మరుసటిరోజైన గురువా రం ఉదయం జయరామనాయుడు నారాలోకేష్‌కు 500 కిలోల ఆపిల్స్‌తో గజమాల క్రేన్‌తో వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుని క్యాంప్‌సైట్ పూలవాండ్లపల్లెకు చేరుకున్నాడు. నారాలోకేష్ పాదయాత్ర ప్రారంభంలోనే వేయాలని భావించి సిద్ధం చేసుకుంటుండగా దొమ్మలపాటి రమేష్ దీనికి అంగీకరించలేదు. దండ వేసేందుకు ససేమిరా కుదరదంటూ నారాలోకేష్‌కు కరాఖండిగా చెప్పేశారు. దీంతో ఆయన మదనపల్లె దగ్గర వే యవచ్చని జయరామనాయుడుకు సర్దిచెప్పి ఆయనను పాదయాత్రలో రావాల్సిందిగా కోరారు. లోకేష్ మాట ప్రకారం జయరామనాయుడు పాదయాత్రలో నడుస్తుండగా, రమేష్ వర్గీయులు కావాలనే జయరామనాయుడును గిల్లడం, కాలితో తొక్కడం, గోలగోల చేయడంలాంటి చేష్టలతో ఇబ్బందులు పెట్టసాగారు. దీన్ని లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో చివరకు అలిగిన ఆయన ఏకంగా పాదయాత్ర నుంచి ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో జయరామనాయుడు వర్గీయులు యువగళం పాదయాత్రలో తమ నాయకుడికి జరిగిన అవమానంపై రగిలిపోతున్నారు.

ఆహ్వానించి...అవమానపరచడమెందుకు?

- నారా లోకేష్ తీరుపై పాల ఏకరుల ఆగ్రహం
- వినతికే పరిమితం చేయడాన్ని ఖండించిన సంఘ నాయకులు

మదనపల్లె : యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌తో గంటసేపు సమావేశం ఉంటుందని పత్రికాప్రకటనలు ఇచ్చి కులస్తులందరినీ ఆహ్వానించి, కేవలం అర్జీ తీసుకుని అవమానపరచడంపై పాల ఏకరి కులస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మదనపల్లెలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాల ఏకరి సంఘ నాయకులు జన్నే శేషాచలపతినాయుడు మాట్లాడుతూ నారాలోకేష్ పాదయాత్ర ప్రారంభం సందర్భంగా ఉదయం 8 నుంచి 9 గంటలవరకు పాల ఏకరులతో సమీక్షా సమావేశం ఉంటుందని, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి అందరినీ రావాల్సిందిగా పిలుపునిచ్చారన్నారు. దీంతో టీడీపీ నాయకుల మాటలను నమ్మి సమీక్షా సమావేశానికి వెళ్లినవారిని అక్కడివారు పట్టించుకోలేదని, అంతే కాకుండా కేవలం అర్జీకు పరిమితం చేసి సెల్ఫీ తీసుకుని పంపేశారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తమను ఓటుబ్యాంకుగా వాడుకుని చిన్నచూపు చూడటం తప్ప తమ కులానికి చేసిన మేలు లేదన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో పాల ఏకరి కులాన్ని బీసీ జాబితాలో చేర్చడం వల్ల నేడు ఎందరో తమ కులస్తులు డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. యువగళం పాదయాత్రలో ఇతర కులాలకు చెందిన వ్యక్తులతో సమయాన్ని వెచ్చించి, పాల ఏకరి కులాన్ని నిర్లక్ష్యం చేయడంపై నారాలోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాల ఏకరి నాయకులు జన్నే సుబ్బయ్యనాయుడు, మాజీ ఎంపీటీసీ మల్లికార్జుననాయుడు, వెంకటస్వామినాయుడు, కౌన్సిలర్ సుగుణ, ఆంజనేయులు, నాగార్జున, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు గాయాలు



లారీని ఢీ కొన్న ఘటనలో దెబ్బతిన్న 104 వాహనం

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె, యన్ పాలగిరి క్రాస్‌కు మధ్యలో గురువారం 104 వాహనం –లారీ ఢీ కొన్న ఘటనలో 104 వాహనం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. వీరపునాయునిపల్లె నుంచి యు రాజుపాలెం గ్రామానికి వెళుతున్న 104 వాహనం మోటర్ సైకిల్ ను తప్పించబోయి వేంపల్లె నుంచి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

ఏసీబీ వలకు చిక్కిన వీఆర్‌ఓ



ఏసీబీకి పట్టుబడిన వీఆర్‌ఓ రహమత్ ఖాన్

రాయచోటి : రాయచోటి రూరల్ మండలం, మాధవరం వీఆర్‌ఓ రహమత్ ఖాన్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. గురువారం ఉదయం మాధవరం సచివాలయం సమీపంలో మహిళా రైతు నీలావతి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. మాధవరం గ్రామం, కటిసేనివారిపల్లెకు చెందిన నీలావతిని కొన్ని నెలలుగా భూమి పాసుబుక్కు ఇవ్వాలంటే డబ్బులు ఇవ్వాలని వేధించడమే కాకుండా కాలయాపన చేయడంపై ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. గురువారం ఉదయం ఏసీబీ అధికారులు చూస్తుండగానే రూ. 5 వేలు డబ్బులు తీసుకోవడంతో అక్కడే ఉన్న పోలీసులు పట్టుకున్నారు. వీఆర్‌ఓపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు కడప ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

వైభవంగా పుష్పయాగం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఉదయాన్నే స్వామివార్లకు తోమాలసేవ నిర్వహించారు. పవిత్ర జలాలతో స్నపన తిరుమంజనం కన్నులపండుగగా నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు వాహనమండపంలో తిరుచ్చి అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి రంగురంగుల పుష్పాలను పెద్ద ఎత్తున తెప్పించి గ్రామోత్సవం నిర్వహించారు. వాటితో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు కడప, విశాఖ

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీలో విశాఖ, కడప జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. రైల్వే స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో సెమీస్ చేరేందుకు వైఎస్సార్ కడప జట్టు 6–0 గోల్స్ తేడాతో కర్నూల్ జట్టుపై విజయం సాధించింది. జట్టు తరపున అనురాధ మూడు గోల్స్ చేయగా అరుణ రెండు, రామలక్ష్మి ఓ గోల్ చేశారు. సెమీస్ చేరేందుకు చెరో మ్యాచ్ గెలిచిన విశాఖ–చిత్తూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరికి విశాఖ జట్టు 4–3తో విజయం సాధించి సెమీస్‌కు చేరింది. హేమహాసిని మూడు, వరలక్ష్మి ఓ గోల్ చేయగా చిత్తూరు తరపున షహీనా మూడు గోల్స్ చేసింది. కల్యాణి, శృతి, ధరణి ఒక్కో గోల్ చేయడంతో కృష్ణా జట్టు 3–0తో శ్రీకాకుళంపై విజయం సాధించింది. తూర్పుగోదావరి జట్టు 2–0తో విజయనగరం జట్టుపై విజయం సాధించింది. అశ్విని, గాయత్రి చెరో గోల్ చేశారు. ఏపీ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాల జట్లు తలపడుతున్నాయి.



గోల్ చేసేందుకు ప్రయత్నిస్తున్న కడప స్ట్రయికర్స్

కడప నగర వనంలో

ట్రెక్కింగ్ ఏర్పాటు చేయాలి



కడప నగర వనంలో అటవీశాఖ అధికారులు

పీసీసీఎఫ్ వై. మధుసూదన్ రెడ్డి

కడప అర్బన్ : కడప నగర వనంలో ప్రజలకు ట్రెక్కింగ్ అందుబాటులోకి తీసుకురావాలని పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) వై. మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన కడపలోని నగరవనం, గువ్వల చెరువు ప్రాంతాలలో పర్యటించారు. కడప నగర వనంలో వాలీబాల్ కోర్టు, షటిల్ బ్యాట్మింటన్ కోర్టులను ప్రారంభించారు. కడప నగర వనంలో ట్రెక్కింగ్ మార్గాన్ని అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ భవనం, పైన ప్రదేశాన్ని ప్రజల కోసం అందమైన హబ్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అనంతరం గువ్వలచెరువు ఘాట్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలో మినీ నగరవనాన్ని ఏర్పాటు చేయాలని, ఏకో టూరిజంను అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ కూడా ట్రెక్కింగ్ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలన్నారు. రోప్‌వే వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కర్నూలు పి. రామకృష్ణ, కడప జిల్లా అటవీ అధికారి పి.వి సందీప్‌రెడ్డి, డీఎఫ్ఓలు గురుప్రభాకర్, నాగార్జునరెడ్డి, కడప రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



ధ్వజస్తంభ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా రఘునాథరెడ్డి

నందలూరు (రాజంపేట) : నందలూరులో చోళుల కాలం నాటి శ్రీ కామాక్షి సమేత ఉల్లంఘేశ్వరాలయం విగ్రహప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దంపతులు, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదనరెడ్డి, వైసీపల్లె సర్పంచి మేడా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. వీరికి సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వీరి వెంట తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు భూమన శంకర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, నందలూరు నాయకులు అరిగెల నాని, సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాల నాగ సుబ్బయ్య, రాజంపేట ఏరియా హాస్పిటల్ ఉమా, రూరల్ జెఏసీ కన్వీనరు మందరం గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు సౌమ్యనాథున్ని దర్శించుకున్నారు. ఉల్లంఘేశ్వరాలయం అభివృద్ధికి సొంత నిధులు కేటాయించామని ఎమ్మార్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో కడప ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, జడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తంబళ్ల వేణుగోపాల్ రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు లక్ష్మీ నరసయ్య, నాగిరెడ్డిపల్లె సర్పంచి జంబు సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా నంది విగ్రహం ప్రతిష్ఠ..

చోళులకాలం నాటి నంది విగ్రహాన్ని గుప్తనిధుల ముఠా తీసుకెళ్లిన నేపథ్యంలో నూతన విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. చోళుల కా లంనాటి ఉల్లంఘేశ్వర స్వామి (శివలింగం), శ్రీకామాక్షి అమ్మవారు, గణపతి, సుబ్రమణ్యంస్వామి, కాలభైరవుడులను యథావిధి గా ఆలయంలో పునఃప్రతిష్ఠించారు. కాగా మధ్యాహ్నం శ్రీ కామాక్షి సమేత ఉల్లంఘేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు.